డిగ్రీలో భాష బోధన పూర్తి స్థాయిలో కొనసాగించాలి



సమావేశంలో పాల్గొన్న కోదండరాం, హరగోపాల్, నందిని సిధారెడ్డి తదితరులు

పంజాగుట్ట, మే 31 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ కళాశాలల్లో భాష బోధన పూర్తి స్థాయిలో కొనసాగించాలని, భాష క్రెడిట్ల సంఖ్యను తగ్గించాలన్న ఉన్నత విద్యా మండలి నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని వక్తలు డిమాండ్ చేశారు. మాతృభాషపై ఎందుకు అంత చులకన అని వారు ప్రశ్నించారు. డిగ్రీ భాష బోధన పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో టీజేఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ప్రొఫెసర్ హరగోపాల్, కవి, రచయిత నందిని సిధారెడ్డి, తదితరులు మాట్లాడారు. విద్యార్థులకు ఆసక్తి కలిగించే విధంగా మూల్యాంకనం అవసరమని ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ప్రభుత్వం మారినప్పుడల్లా విద్యా విధానాన్ని మార్చడం సరి అయిన పద్ధతి కాదని నందిని సిధారెడ్డి అన్నారు. ఈ సమావేశంలో పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రామాచారి, ప్రొఫెసర్ మాయాదేవి, డాక్టర్ నీరజ, ఆది రమేష్, కృష్ణ, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

'గాజాలో మానవ హక్కుల ఉల్లంఘన'

బర్కత్‌పుర, మే 31 (ఆంధ్రజ్యోతి): గాజాలో అమాయకులు, చిన్నారులు, మహిళలను ఇజ్రాయెల్ చంపేస్తూ మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతుందని, దీనికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సహకారం అందిస్తున్నారని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, సీపీఐ మాజీ ఎంపీ అజీజ్‌పాషా, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ ఆరోపించారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో పీపుల్స్ సాలిడారిటీ ఫర్ పాలస్తీనా ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. యూఎన్‌వోతో పాటు ప్రపంచ దేశాలు స్పందించి పాలస్తీనీయులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఇజ్రాయెల్ శాశ్వత కాల్పుల విరమణ ప్రకటించి పాలస్తీనీయులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలుసంఘాల నేతలు అబ్బాస్, మాథ్యూస్, ఉమర్ అహ్మద్ హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

జైలు జీవితం ఖైదీల్లో మార్పు తెచ్చేలా ఉండాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డీజీ సౌమ్యమిశ్రా

సైదాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): జైలు జీవితం ఖైదీలకు శిక్ష కాకుండా, వారిని మార్చడానికి సహాయపడే మార్గదర్శకంగా ఉండాలని జైళ్ల శాఖ డీజీ డాక్టర్ సౌమ్యమిశ్రా సూచించారు. శనివారం చంచల్‌గూడలోని సీకా కాన్ఫరెన్స్ హాల్‌లో శిక్ష, ప్రణాళిక, చొరవ ప్రాజెక్టును డీజీ ప్రారంభించారు. శిక్ష అనేది ఖైదీలకు పునరావాసం, సమాజంలో వారి పునః నవీకరణకు మద్దతు ఇవ్వడానికి వ్యక్తిగతీకరించిన వ్యూహమని అన్నారు. జైలు సిబ్బంది, మనస్తత్వవేత్తలు, విద్యావేత్తలు ఖైదీలు సహకార ప్రయత్నాల ద్వారా శిక్ష ప్రణాళిక ఏర్పర్చుకోవడం కోసం డైనమిక్ ఫ్రేమ్ వర్క్ అందిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐజీ డాక్టర్ ఎం.ఆర్.అహ్మద్, ఐజీలు వై.రాజేష్, మురళీబాబు, డీఐజీలు డాక్టర్ శ్రీనివాస్, సంపత్, జైలు సూపరింటెండెంట్లు, డిప్యూటీ సూపరింటెండెంట్లు, అధికారులు పాల్గొన్నారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షా కేంద్రాల వద్ద ప్రత్యేక బందోబస్తు

హైదరాబాద్ సిటీ, మే 31 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరుగుతున్న పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షా కేంద్రాల వద్ద ప్రత్యేక బందోబస్తు నిబంధనలు అమల్లో ఉంటాయని సీపీ అవినాశ్ మహంతి ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 3 నుంచి 13 వరకు జరుగనున్న పరీక్షల సందర్భంగా ఆయా కేంద్రాల వద్ద ఎక్కువ మంది గూమిగూడి ఉండడం నిషేధమని, అదేవిధంగా 200 మీటర్ల పరిధిలో ఉన్న జిరాక్స్ సెంటర్‌లు, ఇంటర్నెట్ కేంద్రాలు మూసివేయాలని సూచించారు. ఈ నిబంధనలు 3వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 13వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు అమల్లో ఉంటాయని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని సీపీ పేర్కొన్నారు.

నాలాల కబ్జాపై హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదులకు ఆహ్వానం

హైదరాబాద్ సిటీ, మే 31(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం నేపథ్యంలో నాలాల కబ్జాను అరికట్టడంపై హైడ్రా దృష్టి సారించింది. ఈ మేరకు ప్రతి సోమవారం జరిగే ప్రజావాణిలో ఫిర్యాదులకు ఆహ్వానిస్తున్నట్లు ప్రకటించింది. జూన్‌తో పాటు అవసరమైతే జూలైలో కూడా నాలాల సమస్యలపైనే ఫిర్యాదులు స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అధికారులను ఆదేశించారు. ఓఆర్ఆర్ పరిధిలో నాలాల కబ్జాలకు సంబంధించి ఎలాంటి సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. నాలా ఆక్రమణకు గురైనట్టు రుజువు చేసే చిత్రాలు పాతవి, ప్రస్తుతానివి కూడా తీసుకొచ్చి ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తే ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు.

'టీచర్ల సర్దుబాటు ఉత్తర్వులను నిలిపివేయాలి'

హైదరాబాద్ సిటీ, మే 31(ఆంధ్రజ్యోతి): టీచర్ల సర్దుబాటు ఉత్తర్వులను వెంటనే నిలిపివేయాలని ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొన్యాల మల్లికార్జున్‌రెడ్డి విద్యాశాఖను డిమాండ్ చేశారు. జీఓ 25ను తక్షణమే సవరించి విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను కేటాయించాలని కోరారు. జూన్ 6 నుంచి బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించి, పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచాలని సూచించిన అధికారులు వాటి ఫలితాలు చూడకుండానే జూన్ 13 నాడే సర్దుబాటు అయిన టీచర్లు జాయిన్ కావాలని ఇటీవల ఉత్తర్వులు జారీ చేయడం అనాలోచిత చర్యకు నిదర్శనమన్నారు. బడిబాట పూర్తయిన తర్వాత జులై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో చేయాల్సిన టీచర్ల సర్దుబాటును జూన్ 13 వరకే చేయాలని ఉత్తర్వులు ఇవ్వడం ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్యను భ్రష్టు పట్టించడమేనన్నారు.

'ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి'

గన్‌పార్క్, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం నాడు ఉద్యమకారులకు ప్రభుత్వం ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి, గుర్తింపు కార్డులను జారీ చేయాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ, తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. శనివారం నగరంలోని గన్‌పార్కు వద్ద తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక, మలిదశ ఉద్యమకారుల సంక్షేమ సంఘం, తొలి దశ ఉద్యమకారుల ఫోరం, తెలంగాణ ఉద్యమకారుల వేదిక, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ కోదండరాం హాజరై ఉద్యమకారులకు మద్దతు తెలిపి, వారి డిమాండ్లను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉద్యమ నేతలు రామగిరి ప్రకాశ్, నగేశ్, చంద్రన్న ప్రసాద్, అంజలి, లావణ్య, సుజి, స్వరూపరాణి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

అప్పుడే పుట్టిన బిడ్డ, బాలింత మృతి

● బాలానగర్ పీహెచ్‌సీలో ఘటన

హైదర్‌నగర్, మే 31 (ఆంధ్రజ్యోతి): బాలింత, ఆమెకు పుట్టిన బిడ్డ మృతి చెందిన ఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కేపీహెచ్‌బీ ఫోర్త్‌ఫేజ్‌కు చెందిన సామ్యూల్, అరుణ (22) దంపతులు. వీరికి ఏడాది క్రితం వివాహమైంది. సామ్యూల్ ఆటో డ్రైవర్. నిండు గర్భిణిగా ఉన్న అరుణకు శుక్రవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో పురిటినొప్పులు తీవ్రం కావడంతో ఆశా కార్యకర్తకు సమాచారం అందించడంతో వారు వెంటనే బాలానగర్ పీహెచ్‌సీకి తరలించారు. ఈ సందర్భంగా ఏఎన్ఎంలు శనివారం ఉదయం 7.30 గంటల ప్రాంతంలో అరుణకు డెలివరీ చేయగా.. బాబుకు జన్మనిచ్చింది. ప్రసవం అనంతరం పుట్టిన బిడ్డ స్పందించడం లేదని, నిలోఫర్ ఆస్పత్రికి తరలించాలని ఏఎన్ఎంలు, ఇతర సిబ్బంది కుటుంబసభ్యులకు సూచించారు. వారు బాబును ఆస్పత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఇదిలా ఉండగా, డెలివరీ అనంతరం ఉదయం 8 గంటల ప్రాంతంలో అరుణ పరిస్థితి కూడా విషమించడంతో ఆమెను బాలానగర్ పీహెచ్‌సీ సిబ్బంది సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. కాగా, పీహెచ్‌సీ వైద్యుల నిర్లక్ష్యంతోనే అరుణ, ఆమెకు పుట్టిన బిడ్డ చనిపోయారంటూ బంధువులు ఆరోపించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బాలానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఓల్డ్ మలక్‌పేటలో డ్రైనేజీ పనులు ముమ్మరం

● ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని ట్రాఫిక్ పోలీసుల సూచన

హైదరాబాద్ సిటీ, మే 31(ఆంధ్రజ్యోతి): సిటీ కమిషనరేట్ పరిధిలోని ఓల్డ్‌మలక్‌పేట అక్బర్ ప్లాజా భవనం వద్ద డ్రైనేజీ పైపులైన్ లీకేజీ కారణంగా రోడ్డుపై విపరీతంగా వరదనీరు చేరడంతో శుక్రవారం ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో చాదర్‌ఘాట్ నుంచి నల్గొండ ఎక్స్‌రోడ్డు, దిల్‌సుఖ్‌నగర్ వైపు జాతీయ రహదారి మీదుగా వెళ్లాల్సిన వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో శనివారం జీహెచ్ఎంసీ, హైదరాబాద్ వాటర్ వర్క్స్ అధికారులు డ్రైనేజీ మరమ్మతు పనులు చేపట్టారు. దాంతో పనులు పూర్తయ్యేంత వరకు ఆ ప్రాంతంలో ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని, ట్రాఫిక్ నెమ్మదిగా వెళ్లే అవకాశం ఉన్నందున ప్రత్నామ్నాయ మార్గాల ద్వారా వాహనదారులు గమ్య స్థానాలకు చేరుకోవాలని సిటీ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ట్రాఫిక్ ఆంక్షలు..

- ఎంజీబీఎస్ చాదర్‌ఘాట్ వంతెన నుంచి వచ్చే వాహనాలను చాదర్‌ఘాట్ ఎక్స్‌రోడ్డు, మలక్‌పేట వైపు అనుమతించరు.
- కోఠి రంగమహల్ నుంచి చాదర్‌ఘాట్ మీదుగా వచ్చే వాహనాలను చాదర్‌ఘాట్ రోటరీ, చాదర్‌ఘాట్ వంతెన, మలక్‌పేట వైపు అనుమతించరు.

ట్రాఫిక్ మళ్లింపులు..

ఎంజీబీఎస్ ఎగ్జిట్ నుంచి విజయవాడ, సూర్యాపేట, నల్గొండ, ఖమ్మం వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులను చాదర్‌ఘాట్ ఎక్స్‌రోడ్డు, నింబోలి అడ్డా, అంబర్‌పేట కొత్త ఫ్లైవోవర్, రామాంతపూర్, ఉప్పల్, ఎల్బీనగర్ వైపు మళ్లిస్తారు. కల్వకుర్తి, దేవరకొండ, శ్రీశైలం వెళ్లే బస్సులు సైతం అదే మార్గంలో మళ్లిస్తారు. అంతేకాకుండా మే 31 రాత్రి పది గంటల నుంచి జూన్-1 సాయంత్రం 6 వరకు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు సిటీ పరిధిలోకి ప్రవేశించవద్దని సూచించారు.

సిటీ బస్సుల మళ్లింపులు..

దిల్‌సుఖ్‌నగర్, ఎల్‌బీనగర్, సైదాబాద్, ఇబ్రహీంపట్నం వెళ్లే ఆర్టీసీ సిటీ బస్సులను చాదర్‌ఘాట్ ఎక్స్‌రోడ్డు, నింబోలి అడ్డా, చే నంబర్ జంక్షన్, న్యూ గోల్నాక వంతెన, మూసారాంబాగ్ ఆర్టీఏ, మూసారాంబాగ్ ఎక్స్‌రోడ్డు మీదుగా మళ్లించి దిల్‌సుఖ్‌నగర్ వైపు, కుడివైపు నల్గొండ ఎక్స్‌రోడ్డు, సైదాబాద్ వైపు మళ్లిస్తారు. ముఖ్యమైన మళ్లింపు పాయింట్లు ఎంజీబీఎస్ వెనుక గేటు, చాదర్‌ఘాట్ రోటరీ, అజంపురా ఎక్స్‌రోడ్డు, భారత్ పెట్రోల్ బంక్, మలక్‌పేట కావేజ్, మలక్‌పేట టీ జంక్షన్, చాదర్‌ఘాట్ చోటా వంతెన, చాదర్‌ఘాట్ ఎక్స్‌రోడ్డు, చే నంబర్ ప్రాంతాలుగా పోలీసులు గుర్తించినట్లు జాయింట్ కమిషనర్ జోయల్ డేవిజ్ పేర్కొన్నారు.

ఘనంగా ఆలయ పాలకమండలి ధర్మకర్తల ప్రమాణ స్వీకారం



కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో నూతన పాలకమండలి ధర్మకర్తల చేత ప్రమాణ స్వీకారం చేయిస్తున్న దేవాదాయశాఖ ఏసీ చంద్రశేఖర్

చంపాపేట, మే 31(ఆంధ్రజ్యోతి): కర్మన్‌ఘాట్‌లో ప్రసిద్ధిగాంచిన హనుమాన్ ఆలయ నూతన పాలకమండలి ధర్మకర్తల ప్రమాణ స్వీకారం శనివారం ధ్యానాంజనేయస్వామి సన్నిధిలో ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో ఎస్.లావణ్య పర్యవేక్షణలో రంగారెడ్డి జిల్లా దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ నూతనంగా నియమితులైన ధర్మకర్తలు ఈదులకంటి సత్యనారాయణరెడ్డి, అనుముల రవీందర్‌రెడ్డి, దిండు ప్రవీణ్‌గౌడ్, తోకటి కిరణ్‌కుమార్, సింగంశెట్టి శ్రీనివాస్, విష్ణువర్ధన్‌రెడ్డి, నారాయణ్‌దుర్గారెడ్డి, కుకునూరి గోపాల్‌రెడ్డి, పూల నాగరాజు, కెకవిత, ఓరుగంటి నరేష్, కొండ్ర సంతోష్‌కుమార్, బండిగారి శ్రీనివాస్‌గౌడ్, ఎక్స్‌అఫిషియో మెంబర్ ఎస్.అంబప్రసాద్‌ల చేత ప్రమాణం చేయించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, కాంగ్రెస్ ఎల్బీనగర్ ఇన్‌చార్జి మధుయాష్కీగౌడ్, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాత, టీపీసీసీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి హాజరయ్యారు. నూతన ధర్మకర్తలను ఈవో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ నూతన పాలకమండలి ధర్మకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. పాలకమండలిని నియమించినందుకు గాను సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్ రెడ్డి, వనస్థలిపురం కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఏసీపీ కృష్ణయ్య పాల్గొన్నారు.



అక్బర్‌బాగ్‌లో మురుగు నీరు పొంగిపొర్లిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జీహెచ్ఎంసీ, హైడ్రా కమిషనర్లు ఆర్‌వీ కర్ణన్, రంగనాథ్

పైపులైన్లు క్లీన్ చేయండి లేదా కొత్తవి నిర్మించండి

● అక్బర్‌బాగ్‌ను సందర్శించిన జీహెచ్ఎంసీ, హైడ్రా కమిషనర్లు

ఓల్డ్‌మలక్‌పేట, మే 31 (ఆంధ్రజ్యోతి): డ్రైనేజీ ఓవర్ ఫ్లో కాకుండా పైపులైన్లు క్లీన్ చేయండి లేదా కొత్త పైప్‌లైన్లు నిర్మించండని సిబ్బందిని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశించారు. మలక్‌పేటలోని అక్బర్‌బాగ్‌లో మురుగునీరు పొంగుతున్న ప్రాంతాన్ని వారు శనివారం పరిశీలించారు. శుక్రవారం నుంచి డ్రైనేజీ ఓవర్ ఫ్లో అవుతుండడం ఆ మార్గంలో భారీగా ట్రాఫిక్ జామ్ అయిన దృష్ట్యా క్షేత్రస్థాయిలో మరమ్మతు పనులు పరిశీలించారు. సమస్యకు కారణాలేంటి..? మరమ్మతులో ఆలస్యమెందుకైంది..? ఇంత తీవ్రంగా మారే వరకు ఏం చేశారని సంబంధిత అధికారులను ప్రశ్నించారు. వెంటనే మరమ్మతు పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. పరిష్కార మార్గాలపై జీహెచ్ఎంసీ, వాటర్‌బోర్డు అధికారులతో వారు చర్చించారు. వంద మీటర్ల మేర ఉన్న పైపులైనులో పేరుకుపోయిన నిర్మాణ రంగ వ్యర్థాలను హైప్రెజర్ జెట్టింగ్ యంత్రంతో తొలగించాలని సూచించారు. అయినా సమస్య పరిష్కారం కాని పక్షంలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా నూతన పైపులైన్ వేయాలని వారు ఆదేశించారు. పైప్‌లైన్ల మరమ్మతు పనులు శనివారం రాత్రి నుంచి చేపడుతున్న దృష్ట్యా చాదర్‌ఘాట్ నుంచి దిల్‌సుఖ్‌నగర్ వైపు వెళ్లే వాహనదారులు ప్రత్యామ్నాయ దారుల వెంట వెళ్లాలని ట్రాఫిక్ డీసీపీ వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ సూచించారు. ఈ ప్రాంతాన్ని జలమండలి ఈడీ మాయంక్ మిట్టల్, ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్ పరిశీలించారు.

చావునీలో పొంగిపొర్లుతున్న వరదనీటి కాలువ



చావునీలో వరదనీటి కాలువ నుంచి పొంగుతున్న మురుగుని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బలాల

చాదర్‌ఘాట్, మే 31(ఆంధ్రజ్యోతి): చావునీ డివిజన్‌లోని చావునీ మెయిన్ రోడ్డులో పొంగిపొర్లుతున్న వరదనీటి కాలువను మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల శనివారం పరిశీలించారు. చంచల్‌గూడ పిల్లి గుడిసెల డబుల్‌బెడ్‌రూం ఇళ్ల సీవరేజీ లైన్‌ను ఇక్కడి వరదనీటి కాలువలోకి కలపడం వల్లే ఈ సమస్య తలెత్తినట్లు గుర్తించిన జీహెచ్ఎంసీ ఏఈ మల్లికార్జున్ ఎమ్మెల్యేకు వివరించారు. దీంతో పాటు కుర్మగూడ, ఉప్పర్‌బస్తీ, మాదన్నపేటలోని అనేక ఇళ్లు, అపార్ట్‌మెంట్‌ల సీవరేజీ లైన్‌ను చావునీలోని వరదనీటి కాలువలోకి కలిసి ఉన్నాయని ఏఈ తెలిపారు.

రూ.50లక్షలతో కాలువ పునరుద్ధరణకు ప్రతిపాదనలు

చావునీలో పొంగిపొర్లుతున్న వరదనీటి కాలువతో తలెత్తుతున్న సమస్యను పరిష్కరించేందుకు కాలువను పునరుద్ధరించాలని ఎమ్మెల్యే బలాల జీహెచ్ఎంసీ ఏఈ మల్లికార్జున్‌కు సూచించారు. ఇందుకు రూ.50లక్షల వ్యయమవుతుందని ప్రతిపాదనలు తయారు చేస్తున్నట్లు ఏఈ వివరించారు. చావునీ నుంచి యాకుత్‌పురలోని ఓపెన్ నాలా వరకు దాదాపు అర కిలోమీటర్ పొడవున వరదనీటి కాలువను పునరుద్ధరించేందుకు ప్రతిపాదనలు తయారు చేయనున్నారు. కార్యక్రమంలో చావునీ కార్పొరేటర్ షాహిద్ మూన్ తదితరులు పాల్గొన్నారు.

వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్‌గా మహేష్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న మహేష్

వనస్థలిపురం: రాచకొండ పోలీస్ కమిషనర్ ఉత్తర్వుల మేరకు వనస్థలిపురం నూతన ఇన్‌స్పెక్టర్‌గా టి.మహేష్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇన్‌స్పెక్టర్‌గా విధు లు నిర్వహించిన సీహెచ్.శ్రీనివాస్ ఇటీవల బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మహేష్ మాట్లాడుతూ శాంతిభద్రతలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

బీజేపీ ఐఎస్‌సదన్ డివిజన్ కార్యవర్గం నియామకం

సైదాబాద్, మే 31(ఆంధ్రజ్యోతి): ఐఎస్‌సదన్ డివిజన్ బీజేపీ నూతన కార్యవర్గాన్ని శనివారం చంపాపేటలోని కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి నివాసంలో జరిగిన సమావేశంలో డివిజన్ ఇన్‌చార్జి పుప్పాల శ్రీనాథ్ శనివారం ప్రకటించారు. నూతన అధ్యక్షుడిగా గంగిరెడ్డి గిరిధర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా వెంకట్‌రెడ్డి, మధుమతి, ముఖేష్, అమరేశ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా బొమ్మల ప్రశాంత్, విశాల్ గౌడ్, కార్యదర్శులుగా వెంకటరమణ, అరుణ్‌కుమార్, వెంకటకుమారి, రాజశేఖర్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, కోశాధికారిగా శాలినినాయక్‌లు నియమితులయ్యారు. సమావేశంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు మధుకర్ రెడ్డి, అధికార ప్రతినిధి వీరేందర్‌బాబు, అసెంబ్లీ కన్వీనర్ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అమర్నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న ఏసీపీ ఠాకూర్‌సుఖ్‌దేవ్‌సింగ్

సంతోష్‌నగర్, మే 31(ఆంధ్రజ్యోతి): పండుగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని సంతోష్‌నగర్ డివిజన్ ఏసీపీ ఠాకూర్‌సుఖ్‌దేవ్ సింగ్ అన్నారు. బక్రీద్ సందర్భంగా మతపెద్దలు, శాంతిసంఘ సభ్యులతో కలిసి సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో సమావేశం ఏర్పాటు చేశారు.రానున్న పండుగలలో ముందుగా బక్రీద్ వస్తుందని ఈ నేపథ్యంలో అందరూ సోదరభావంతో మెలగాలని సూ చించారు. పండుగలను కలిసికట్టుగా నిర్వహించుకుంటూ సోదరభావాన్ని పెం పొందించుకోవడంతో పాటు మతసామరస్యాన్ని చాటాలని విజ్ఞప్తి చేశారు. సమన్వయంతో వ్యవహరిస్తూ పోలీసులకు సహకరించాలన్నారు. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఎవరి మనోభావాలు దెబ్బతీయకుండా పండుగలను ఘనంగా నిర్వహించుకోవాలని సూచించారు. ఎవరైన అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే తమకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో అదనపు ఇన్‌స్పెక్టర్ జగన్‌రెడ్డి, ఎస్‌ఐలు రవిగౌడ్, మణికంఠ, సిబ్బంది పాల్గొన్నారు.

కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి కృషి



కాలనీవాసుల సమస్యలు తెలుసుకుంటున్న మధుయాష్కీగౌడ్, వెంకటేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం, మే 31(ఆంధ్రజ్యోతి): కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీపీసీసీ ప్రచారా కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. వనస్థలిపురం ఫేజ్-2లోని బీకేఎస్ గ్రౌండ్‌లో ముప్పై లక్షల నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను శనివారం స్థానిక కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి మధుయాష్కీగౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో బీకేఎస్ గ్రౌండ్ అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా నిలిచిందని, ప్రశ్నించిన వారిపై యువత మత్తులో దౌర్జన్యాలకు దిగి కాలనీవాసులను భయభ్రాంతులకు గురిచేసిన సందర్భాలు అనేకం ఉన్నాయని తెలిపారు. ఈ విషయాన్ని కార్పొరేటర్ దృష్టికి కాలనీవాసులు తీసుకరావడంతో పోలీసులతో మాట్లాడి వారి సహకారంతో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పామన్నారు. కార్యక్రమంలో హస్తినాపురం కార్పొరేటర్ సుజాతానాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నేలపాటి రామారావు, అశోక్‌గౌడ్, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు నర్సింహయాదవ్, నాయకులు భాస్కర్ యాదవ్, సామ మహేశ్వర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, స్వర్ణమాధవి, గణేష్‌రెడ్డి, డాక్టర్ సెల్ శ్రీనివాసచారి, రమేష్‌నాయక్, కంచర్ల కవిత, భాను, సాయికిరణ్‌గౌడ్, శోభ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి : డీసీ

చంపాపేట, మే 31(ఆంధ్రజ్యోతి): వర్షాలను దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్క రూ తమ కాలనీల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సేవ ఇస్లావత్ అన్నారు. హస్తినాపురం డివిజన్‌లోని నందనవనంతో పాటు ఆయా కాలనీలలో శనివారం జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సుజాతానాయక్‌తో కలిసి డీసీ పారిశుధ్య కార్యక్రమంలో పాల్గొన్నారు. డీసీ మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని కాలనీలలో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ డీఈ నగేష్‌నాయక్, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, డేరంగుల కృష్ణ, సతీష్‌గౌడ్, మమత మల్లేష్‌గౌడ్, జీహెచ్ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

దామోదర్‌కు ఆత్మీయ వీడ్కోలు

సైదాబాద్, మే 31(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి మిద్దె దామోదర్ శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా మలక్‌పేటలోని ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఆత్మీయ వీడ్కోలు సమావేశానికి ముఖ్యఅతిథిగా మార్కెటింగ్ శాఖ రాష్ట్ర సంచాలకులు లక్ష్మీబాయి హాజరయ్యారు. ఈ సందర్భంగా సంచాలకులు మాట్లాడుతూ మార్కెటింగ్ శాఖలో సుదీర్ఘకాలంగా అంకితభావంతో సేవలందించి అందరి మన్ననలు పొందారని తెలిపారు. అనంతరం దామోదర్ దంపతులను సన్మానించారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చెకోలేకర్ లక్ష్మి సభాధ్యక్షత వహించగా అడిషనల్ డైరెక్టర్ రవికుమార్, మార్కెట్ గ్రేడ్-1 కార్యదర్శి చిలుక నర్సింహారెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ కొట్ల శ్రీనివాస్, మాజీ వైస్ చైర్మన్ భూమేశ్వర్, ఛాంబర్ ఆఫ్ అగ్రి ట్రేడర్స్ అధ్యక్షుడు వెంకటరమణ, వివేకానంద, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం



శివానీ

హయత్‌నగర్ : వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యమైన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. పెద్దఅంబర్‌పేటకు చెందిన బూడిద రవితేజ(27) ఓ ల్యాబ్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం డ్యూటీ ముగించుకుని రాత్రి 11గంటలకు ఇంటికి చేరుకున్నాడు. ఈ సందర్భంగా ఇంటి వద్ద ఉన్న తన స్కూటీని తీసుకుని ఇప్పుడే వస్తానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లిన రవితేజ మరుసటి రోజు సాయంత్రం వరకు కూడా రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. ఆయన ఆచూకీ కోసం బంధువులను విచారించినా లభించలేదు. దీంతో శనివారం రాత్రి రవితేజ తల్లి చంద్రకళ హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కోహెడకు చెందిన పటేల్‌గూడెం శివానీ(29) శుక్రవారం తెల్లవారుజామున ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లింది. ఆమె తల్లి శాంతమ్మ మునిసిపాలిటీలో స్వీపర్‌గా పనిచేస్తోంది. శుక్రవారం తెల్లవారుజామున 5గంటలకు పని కోసం బయటికి వెళ్లిన శాంతమ్మ తిరిగి 8:30కు ఇంటికి వచ్చింది. కాగా, అప్పటికే కూతురు శివానీ ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగిరాకపోవడంతో తల్లి తెలిసిన వారి వద్ద ఆచూకీ కోసం ప్రయత్నించింది. ఎంతకూ కనిపించకపోవడంతో శనివారం రాత్రి హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రేపటి నుంచి బడంగ్‌పేట్‌లో వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక

● 'ఒక మార్పు-అభివృద్ధికి మలుపు' నినాదంతో కార్యక్రమాలు

● ప్రణాళికలో 50 అంశాలు: కమిషనర్ సరస్వతి



వంద రోజుల కార్యాచరణ ప్రణాళికపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న కమిషనర్ సరస్వతి, పాల్గొన్న అధికారులు

సరూర్‌నగర్, మే 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2వ తేదీ నుంచి బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో 'ఒక మార్పు-అభివృద్ధికి మలుపు' నినాదంతో 'వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక'(100 డేస్ యాక్షన్ ప్లాన్) నిర్వహించనున్నట్లు కమిషనర్ పి.సరస్వతి తెలిపారు. దీనిపై అవగాహన కల్పించే నిమిత్తం శనివారం మునిసిపల్ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో సిబ్బందికి అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వందరోజుల కార్యాచరణ ప్రణాళికలో మొత్తం 50 అంశాలకు సంబంధించిన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. మొదటి రోజైన జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కార్యాలయం వద్ద జెండా ఎగురవేసి, అనంతరం అధికారులు, సిబ్బంది, ఆర్పీలు, ఎన్జీవోలు, పలు సంఘాల ప్రతినిధులు, పుర ప్రముఖులతో కలిసి ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.

పారిశుధ్యం, వనమహోత్సవం, ఇంకుడుగుంతల నిర్మాణం వగైరా..

వందరోజుల కార్యక్రమంలో భాగంగా తమ సిబ్బంది ప్రతి రోజు ఎంపిక చేసిన ఏరియాల్లో పర్యటించి, ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పిస్తారని కమిషనర్ సరస్వతి తెలిపారు. ముఖ్యంగా పారిశుధ్యం, ఇంకుడుగుంతల నిర్మాణం, వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు పెద్దఎత్తున చేపట్టనున్నట్లు ఆమె చెప్పారు. ఇంటింటి సర్వే నిర్వహించి ఇంటి నంబర్లు లేని వారికి నంబర్లు జారీ చేయడం, ఇళ్లలో నిర్వహించే చిన్న వ్యాపారాలను గుర్తించి వారికి వ్యాపార లైసెన్సు జారీచేయడం, కాలనీలు, బస్తీల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం వంటివి ఈ ప్రణాళికలో ఉన్నాయని ఆమె వివరించారు. మునిసిపల్ అధికారులు, సిబ్బంది సదరు 50 అంశాలపై అవగాహన పెంచుకుని, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లి వంద శాతం అమలయ్యేలా చూడాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో బడంగ్‌పేట్ ఏఎంసీ శ్యాంసుందర్, మేనేజర్ బి.నాగేశ్వరరావు, ఆర్ఐ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్ఐ వి.యాదగిరి పాల్గొన్నారు.

పొగాకును నిర్మూలిద్దాం.. ఆరోగ్యంగా జీవిద్దాం



పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న సూపరింటెండెంట్ కృష్ణ తదితరులు

వనస్థలిపురం : పొగాకు వాడకాన్ని నిర్మూలిద్దాం.. ఆరోగ్యంగా జీవిద్దామని వనస్థలిపురం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణ పిలుపునిచ్చారు. శనివారం వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలో పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణ మాట్లాడుతూ పొగాకును తాగడం ద్వారా చిన్న, చిన్న వ్యాధుల ద్వారా క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. తమ ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని పొగాకును తాగడం, సేవించడం తక్షణమే మానుకోవాలని ఆయన సూచించారు. డాక్టర్ నాగేందర్, డాక్టర్ మహబూబ్‌ఖాన్, డాక్టర్ ఉమాశ్రీ పాల్గొన్నారు.